

# రెప్పల మీద నీడలు

## – అత్తలూరి విజయలక్ష్మి



## (గత సంచిక తరువాయి)

### 11

**మందపాడు ఎదురుగా** ఉన్న రైల్వే ప్లాట్ ఫారం మీద సిమెంట్ బెంచీ మీద కూర్చున్నారు డాక్టర్ శివరామకృష్ణ, పవిత్ర. గేటుకి రెండు వైపులా ఉన్న చెరువుల మీద నుండి చల్లని గాలి మెల్లగా, ఆగి,ఆగి వీస్తోంది. ఎక్కడి నుంచో మంద్రంగా వస్తోంది పొగడపూల పరిమళం. దూరంగా పడవల రేవులో ఆగి ఉన్న పడవలను చూస్తోంది పవిత్ర. ఆమె కళ్ళు ఆ చెరువులోని కలువలతో పోటీ పడుతున్నాయి.

"పడవలో ప్రయాణం బాగుంటుంది కదూ?" మెరిసే కళ్ళతో అతని వైపు చూస్తూ అంది.

"ఎప్పుడు వెళ్లావు?" అనడిగాడు ఆమె చేతులు రెండూ తన గుప్పిట్లోకి తీసుకుని.

"మా నాన్నతో కలిసి వెళ్లాను." గర్వంగా చెప్పింది.

"ఎక్కడికి వెళ్లావు? " ఆమె కుడి చేయిని మృదువుగా నిమురుతూ అడిగాడు.

అతనలా తన రెండు చేతులు అతని రెండు చేతుల మధ్య బంధించగానే ఆమె ఒళ్లంతా జల్లుమంది. నిపుణుడైన వైణికుడి వ్రేళ్ళ మీద తీయగా మ్రోగిన వీణ తీగ అయింది ఆమె తనువు.

గాలి తరంగాలకి పులకించిపోతూ మధురమైన రాగాలెవో ఆలపించసాగింది. ఆ రాగం ఆమె శ్వాస నుంచి తేలి అతని చెవులకి ఇంపుగా వినిపిస్తుంటే, మధ్య, మధ్య గుప్పిళ్ళు మూసి, తెరుస్తూ తన చేతుల్లో ఉన్న ఆమె చేతులతో ఆడుకుంటూ ఆమె కళ్ళల్లోకి చూస్తూ " ఇప్పుడు పడవలు మనకోసం నడిపేవాళ్ళు ఎవరున్నారు? పోనీలే ఇక్కడ బాగుంది కదూ! ఎవరూ మనలను చూడరు. ఇటు వైపు ఎవరూ రారు. మనిద్దరమే. ఏకాంతంగా... ఇప్పుడు నిన్ను ముద్దు పెట్టుకోవచ్చు కదూ..." ఆమె చెవిలో గుస,గుసగా అన్నాడు.

సంధ్య కిరణాల ఎరుపు ఆమె చెక్కిళ్ళ మీద పడి కెంపుల్లా మెరుస్తున్నాయి. నల్లని కనురెప్పలు బరువుగా వాలిపోతున్నాయి. ఎంత ప్రయత్నించినా రెప్పలు పూర్తిగా ఎత్తి అతన్ని చూడలేకపోతోంది.

"ఇటు చూడు. అలా నేలచూపులు చూస్తే ఎలా?" ఆమె చుబుకం పట్టుకుని మొహం పైకి ఎత్తాడు.

ఆమె రెప్పలు గుత్తులుగా పూసిన నూరువరహాల కొమ్మలు అయి, వాలిపోతున్నాయి. ఆ బరువు సిగ్గు బరువు కాక ఇంకేముంటుంది పరువంలోకి వచ్చిన పడతికి.

"పవిత్రా!" తమకంగా పిలుస్తూ ముందుకు వంచాడు మొహం. వెచ్చటి ఊపిరి ప్రభాత కిరణంలా తాకింది.

పరవశంతో కళ్ళు పూర్తిగా మూసుకుంది.

కాలుతున్న వస్తువేదో పెదాలను తాకింది. అది అతని పెదాలని ఆమెకి అర్థం అయేలోగా ఆమె పెదాలు అతని పెదాలతో ముడిపడ్డాయి. దేనికోసమో అన్వేషిస్తున్నట్టు అక్కడక్కడే చాలాసేపు వెతుకుతూ, ముడుస్తూ, తెరుస్తూ తారట్లాడాయి. అతని బలమైన చేతులు ఆమె భుజాలను చుట్టుకుని గట్టిగా పెనవేసుకున్నాయి.

సంధ్య వాళ్ళిద్దరి ప్రణయోత్సాహానికి తాను అడ్డు అనుకుందేమో నల్లని మబ్బుల చాటుకి వెళ్ళిపోయింది. వెళ్తూ, వెళ్తూ దొంగచాటుగా అయినా ఆ ప్రణయాన్ని చూడచ్చు కదా అనుకుందేమో వెలుగు కోసం కొన్ని నక్షత్రాలను గగనం మీదకు విసిరేసింది.

పడవల రేవు నిశ్శబ్దంగా మెత్తటి శయ్యలా కనిపిస్తోంది దూరం నుంచి.

"అక్కడికి వెళ్దామా?" రహస్యంగా అడిగాడు.

"ఊహు... ఒద్దు. నాకు భయంగా ఉంది."

"భయమెందుకు? ఇంత మనోహరమైన ప్రకృతి మనకి జోల పాడుతుంటే, హాయిగా పవళించక భయం అంటావేంటి?"

"అందుకే...అందుకే" పెదవులు వణికాయి. ఆనంద భాష్పాలో, భావోద్వేగపు స్వేదబిందువులో కానీ ఆమె కనురెప్పల మీద ముత్యాలుగా మెరిసాయి.

అతను మరింత దగ్గరగా జరిగి ఆమెని గుండెలకి హత్తుకున్నాడు. "పవిత్రా! ఐ లవ్ యు" అన్నాడు తమకంగా.

"పె...పెళ్లి చేసుకుందాం."అందామె చెంపల మీద అతని పెదవులు వేస్తున్న ముద్రలు లెక్కపెడుతూ.

"తప్పకుండా... రేపే వచ్చి మీ నాన్నగారితో మాట్లాడతాను సరేనా?" పెదవులు ఆమె కంఠం మీదకి చేరాయి.

ఆకుల మీద నిలిచిన వర్షపు బిందువులు జలజలా ఒంటిమీద రాలినట్టు అయింది ఆమెకి. పులకించిన గడ్డిపూవులా గుబాళించింది.

అకస్మాత్తుగా ఎవరివో కిర్రుచెప్పుల శబ్దం, మాటలు దగ్గరగా వినిపించాయి. గబుక్కున దూరం జరిగింది పవిత్ర. శివరామకృష్ణ కూడా కొంచెం ఎడంగా జరిగి, జేబులో నుంచి సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు.

ఇద్దరు మగవాళ్ళు చేతిలో సంచులు పట్టుకుని ఏవో కబుర్లు చెప్పుకుంటూ వాళ్ళ ముందు నుంచి వెళ్ళిపోయారు.

ఆమె అతని వైపు ఆశ్చర్యంగా చూస్తూ "మీరు సిగరెట్ కాలుస్తారా ?" అనడిగింది.

అతను పొగ పీల్చి వదిలి, ఆ పొగలో నుంచి ఆమె వైపు చూసి నవ్వుతూ అన్నాడు. “మగాడన్నాక సిగరెట్ కాల్చకపోతే రీవి, దర్జా ఉండవు” అన్నాడు.

ఆమె అవుననుకుంది. ఆ క్షణం ఆమెకి అతను ఇద్దరు మిత్రులు సినిమాలో అక్కినేనిలా కనిపించాడు.

“నువ్వెంత బాగున్నావో తెలుసా? అచ్చు జమునలా ఉన్నావు.” స్నేహితురాళ్ళ మాటలు చెవిలో మ్రోగాయి. పెదాల మీద మనోహరమైన చిరునవ్వు విరిసింది.

చిరు చీకట్లలో ఆ చిరునవ్వు అతను గమనించలేదు. ఆమె మాత్రం. మా జంట ఎంత బాగుంటుందో అచ్చు అక్కినేని, జమున జంటలా అనుకుంది.

అతను పొగ వదులుతూనే లేచి నిలబడి, ఆమెకి చేయి అందించాడు. ఆ చేయి అందుకుని లేచి అతన్ని అనుసరించింది ఆమె.

సుదీర్ఘంగా ఉన్న ఆ ప్లాట్ ఫారం మీద నడుస్తున్న ఆ జంటని రెండుకళ్ళు గమనించడం, ఆ కళ్ళల్లో అసూయ భగ్గుమనడం వాళ్లకి తెలియదు.

ఆరోజు శుక్రవారం. పవిత్ర కాలేజ్ కి వెళ్ళిపోయింది.

వర్దని లోపల వంటపని లో ఉంది.

మాధవ ఏదో మీటింగ్ ఉందని టిఫిన్ తినేసి త్వరగా వెళ్ళిపోయాడు.

నాంచారమ్మ  వంటగది గుమ్మమ పక్కనే గోడకానుకుని కూర్చుని, ఒత్తులు చేస్తూ మధ్య, మధ్య కోడలితో కబుర్లు చెప్తోంది.

“అవునే వర్దనీ! ఆ చాముండేశ్వరి ఏదో మాట్లాడాలి వస్తాను అని చెప్పి రాలేదేం?” అనడిగింది.

“నాకేం తెలుసు? ఏం మాట్లాడుతుందిట.” అంది వర్దని.

“అదేగా నాకూ తెలియదు. వస్తుందేమో ఆ చిదంబర రహస్యం విప్పుతుందేమో అనుకున్నాను. అసలు కనిపించడం లేదు కూడా కదా!“

“ఏమోలెండి. వాళ్ళబ్బాయి కి సంబంధం ఏదన్నా కుదిరిందేమో చెప్పలనుకుందేమో! ఒకేసారి కార్డు పుచ్చుకుని పిలుపులకి వస్తారేమో” అంది వర్దని.

“నాకలా అనిపించలేదు. వాళ్ళ పెద్దాడికి మన పవిత్రని అడగాలనుకుంటున్నట్టు అనిపించింది.

“మీకు అలాగే అనిపిస్తుంది. ఇప్పుడే దానికి పెళ్ళేంటి అన్నారుగా?” కొంచెం కినుకగా అంది వర్దని.

“ఇది మరీ బాగుందే. అలా అని మంచి సంబంధం గుమ్మం లోకి వస్తే కాదనుకుంటామా? కుర్రాడు లక్షణంగా ఉంటాడు. మంచి చదువు. ఆవిడ, ఆయన కూడా పిల్లని కంటికి రెప్పలా చూసుకుంటారు. నాకా నమ్మకం ఉంది.”

“అదే అయితే నాకు మాత్రం ఎలాంటి అభ్యంతరం లేదు. పిల్లాడు ముచ్చటగా ఉంటాడు. రెండోవాడిలా కారు నలుపు కాదు” అంది.

“నాకూ బానే నచ్చాడే. మీ ఆయనకి నచ్చాలి… దానికి నచ్చాలి”

ఆవిడ మాట పూర్తి కాకుండానే గేటు చప్పుడవడం, మరికొన్ని క్షణాల్లో గుమ్మం నిండుగా పచ్చటి చాముండేశ్వరి విగ్రహం ప్రత్యక్షం అయింది.

నాంచారమ్మ గబుక్కున ఒళ్లో ఉన్న పత్తి బుట్ట, ఒత్తులు చేత్తో పట్టుకుని లేచి నిలబడి, “రండి, రండి ఇప్పుడే అనుకుంటున్నాను చాలా రోజులైంది మిమ్మల్ని చూసి అని. ఎలా ఉన్నారు?” అని అడిగింది నవ్వుతూ.

వర్దని చేతులో పని వదిలేసి, గుమ్మం దగ్గరగా వచ్చి “నమస్కారమండి. రండి కూర్చోండి” అంది.

ఆవిడ అక్కడే ఉన్న సోఫాలో కూర్చుంది. నాంచారమ్మ ఒత్తుల బుట్ట వర్దని చేతికి ఇచ్చి తనూ ఆవిడ ఎదురుగా కూర్చుంది.

ఎప్పటిలా మెడలో చంద్రహారం, నల్లపూసలు, మంగళసూత్రంతో మహాలక్ష్మిలా కాకుండా, ఇవాళ చాలా నిరాడంబరంగా కనిపించింది ఆవిడ. మంగళ సూత్రం, ఒంటి పేట గొలుసు ఒకటి ఉన్నాయి ఆవిడ మెడలో. చెవులకి ధగదగా మెరిసిపోతుండే డైమండ్స్ స్థానంలో బంగారం దుద్దులు ఉన్నాయి. చీర కూడా వెంకటగిరి చీర కట్టుకుంది.

“ఏమ్మా ఆరోగ్యం బాగుందా?”ఆప్యాయంగా అడిగింది నాంచారమ్మ.

చాముండేశ్వరి కాంతి విహీనంగా నవ్వి “బానే ఉన్నాను పిన్నిగారూ” అంది.

వర్ధని కాఫీ కప్పు తీసుకొచ్చి ఇచ్చింది.

“ఒద్దమ్మా ఇప్పుడే తాగి వచ్చాను” అందావిడ.

“తాగితే తాగారు పర్లేదు. తాగండి” అంటూ కప్పు ఆవిడ చేతిలో పెట్టింది వర్దని.

ఆవిడ బలవంతంగా కప్పు తీసుకుని, టీపాయ్ మీద పెట్టింది.

ఎప్పుడూ గలగల్లాడుతూ ఏవో కబుర్లు చెబుతూనే ఉండే చాముండేశ్వరి ముభావంగా ఉండడం, ఏదో తప్పు చేస్తున్నట్టు మొహం మాటి,మాటికీ పక్కకి తిప్పుకోడం నాంచారమ్మ గమనించింది.

ఏం జరిగిఉంటుంది! ఏం చెప్పాలని వచ్చింది ఈవిడ? ఏదో జరిగితే కానీ ఆవిడ ఇలా ఉండే అవకాశం లేదు. అలా అని గుచ్చి,గుచ్చి అడగలేదు. అందుకే నెమ్మదిగా మొదలుపెట్టింది. “మీ పెద్దబ్బాయికి ఉద్యోగం వచ్చిందా? చదువు పూర్తి అయిందిగా.”

చాముండేశ్వరి పల్చగా నవ్వి “ఒచ్చిందండి” అంది.

“ఇంకేం? సంబంధాలు చూసి పెళ్లి చేస్తే, మీకు కోడలు వస్తుంది. ఆడపిల్లలు కావాలని ఆశపడుతున్నారుగా… ఈరోజుల్లో కూతురైనా, కోడలైనా ఒకటే. ఆడపిల్ల ఇంట్లో మహాలక్ష్మిలా తిరుగుతుంటే ఇంటికే అందం.”

చాముండేశ్వరి మాట్లాడలేదు.

నాంచారమ్మ కోడలి వైపు అర్ధవంతంగా చూసింది. వర్దని భుజాలెగరేసి అక్కడి నుంచి వెళ్ళిపోయింది.

“ఈ రోజుల్లో ప్రేమ పెళ్ళిళ్ళు ఎక్కువైనాయి. మీ అబ్బాయి ఎవరినీ ప్రేమించలేదు కదా! మన కులం అయితే పర్వాలేదు... కాకపోతేనే సమస్య.” నాంచారమ్మ కొనసాగించింది.

అప్పటికీ ఆవిడ మాట్లాడకపోడంతో నాంచారమ్మ మాటలాపేసి ఆవిడనే నిశితంగా గమనించసాగింది. చాముండేశ్వరి మొహం పక్కకి తిప్పుకుని చెంగుతో కళ్ళు తుడుచుకోడం గమనించింది.

మృదువుగా అడిగింది. “ ఏంటమ్మా ఇవాళ అదోలా ఉన్నావు. కంట తడి కూడా పెడుతున్నావు. ఏం జరిగింది? నాకు చెప్పడానికేం నీ తల్లిలాంటి దానిని.”

ఆవిడ స్వరంలో వినిపించిన ఆదరానికి చాముండేశ్వరి కదలిపోయింది. గబుక్కున ఆవిడ రెండు చేతులూ పట్టుకుని,” ఈ మాట అడుగుతున్నందుకు నన్ను క్షమించండి. కానీ ఒక తల్లిగా నా కొడుకు బాధ చూడలేక అడుగుతున్నాను. మీ నిర్ణయం ఏదైనా నాకు శిరోధార్యమే. అడక్కుండా మనసులో దాచి ఉంచితే రేపు ఆ బాధ నాకు రంపపుకోతగా జీవితాంతం నన్ను దహిస్తుంది. అందుకే సాహసం చేసి అడుగుతున్నాను. నన్ను క్షమిస్తారుగా”

నాంచారమ్మ వింతగా చూసింది ఆవిడవైపు. “అంత కోరరానిది ఏముందమ్మా?”అంది.

చాముండేశ్వరి మాట్లాడలేదు. వారం నుంచి ఈ సంఘర్షణతో ఆవిడ నీరసించిపోయింది.

మోహన్ చెప్పిన మాటకి ఆరోజు నోట మాట రాలేదు. నిలువునా వణికిపోయింది.

అప్పటి నుంచీ ఆవిడ మనసులో భీకరమైన యుద్ధం జరుగుతోంది. మోహన్ కోరిక న్యాయం కాదని ఆవిడకి తెలుసు. కానీ, మనసుకి మంచి, చెడుల వివేచన ఉంటుందా? ఉండదు. ప్రేమించే ప్రతి అమ్మాయి, ప్రతి అబ్బాయి తన అర్హతని చూసుకుని, దీనికి నేను అర్హుడినా అని ఆలోచించి, అర్హత, అనర్హతల బేరీజు వేసుకుని ప్రేమించరు. మనసుకి నచ్చింది కావాలి అనుకోడం సహజం. నా కొడుకు మనసున్న వాడు, నల్లగా ఉంటే ఏం? బంగారం లాంటి మనసున్న వాడు. అందంగా ఉన్నవాడు నా కొడుక్కన్నా బాగా చూసుకుంటాడా ఆ పిల్లని. అయినా అడిగితే తప్పేమిటి? సరే అంటే సరే అంటారు. లేదంటే కాదంటారు. అంతేగానీ తలగొట్టి మొలేయరుగా అనుకుంది.

ఆవిడ అంతరాత్మకి స్పష్టంగా అది అసంభవం అని తెలిసినా, కానీ విధి రాతని నమ్మే మనిషిగా ఎన్నో సంసారాలు చూసిన మనిషిగా అందమైన స్త్రీలకి అందమైన పురుషుడే భర్తగా లభించడం అనేది అరుదుగా జరుగుతుంది అని ఆవిడకి తెలుసు. దేవుడి రాతలు ఇంత విచిత్రంగా ఉంటాయి ఎందుకు? అని ఎన్నోసార్లు అనుకుంది. ఆ విచిత్రాల్లో పవిత్రకి, మోహన్ కి రాసి పెట్టి ఉండడం అనేది కూడా చేరి ఉండచ్చు కదా అని ఆవిడ తల్లి మనసు ఆశ పడింది. అందుకే ధైర్యం చేసి వచ్చింది. పవిత్ర దక్కకపోతే తన కొడుకు తనకి దక్కడు అన్నది తేటతెల్లం అయింది. ఇంకా తాత్సారం చేస్తే ఏం

జరుగుతుందో అని నిత్యం భయపడుతూ, కొడుకుని ఒక కంటి కనిపెడుతూ అప్రమత్తంగా గడిపింది ఈ వారం రోజులు. కానీ, మోహన్ మధ్య, మధ్య  అమ్మా అడిగావా అంటూ హెచ్చరించడంతో తప్పనిసరై వచ్చింది.

ఆవిడ నవనాడులూ కూడగట్టుకుని, నెమ్మదిగా అంది" పిన్నిగారూ! నేను అత్యాశకి పోతున్నానని నాకు తెలుసు. కానీ, కానీ తప్పక అడుగుతున్నాను. మా మోహన్..." దుఃఖం అడ్డుపడింది.

నాంచారమ్మ కంగారుగా చూసింది "ఏమైందమ్మా మోహన్ కి?" అంది.

చాముండేశ్వరి అడ్డంగా తలాడిస్తూ "వాడికి ఏమి కాలేదు. కానీ, కానీ..." ఎంత ప్రయత్నించినా ఇంతకన్నా మాటలు రావడంలేదు ఆవిడకి.

నాంచారమ్మకి ఆవిడ మాటల్లో ఏదో అపస్వరం వినిపించింది. కొద్ది, కొద్దిగా అర్ధం ఆయీ, అవనట్టుగా ఉంది. పెద్దాడు గురించి మాట్లాడుతుంది అనుకుంటే మోహన్ అంటుందేమిటి? అనుకుంది. కొంపదీసి పవిత్రని వాడికి అడగదు కదా! పెద్దాడికి కుదిరిపోయిందా? ఒకవేళ కుదిరినా చిన్నాడికి అప్పుడే పెళ్ళేమిటి? వాడింకా పూర్తిగా ఎదగనే లేదు. మనసులో చెలరేగుతున్న భావాలు అణచి పెట్టుకుంటూ, చాముండేశ్వరి  నోటి నుంచి రాబోయే మాటల  కోసం ఎదురుచూస్తూ ఆవిడ వైపే చూడసాగింది.

వస్తున్న కన్నీళ్లు బలవంతంగా అణచుకుంటూ ఎవరో తరుముకొస్తున్నట్టు గబగబా చెప్పింది చాముండేశ్వరి.

"మా మోహన్ మీ మనవరాలిని ప్రేమించాడు. చేసుకుంటే ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటా, లేకపోతే చచ్చిపోతా అని పంతం పట్టాడు. పిన్నిగారూ నాకు పుత్రభిక్ష పెట్టండి."

తన రెండు చేతులూ విసురుగా లాక్కుంది నాంచారమ్మ.  ఎంత సాహసం! అనుకున్నంతా అయిందనమాట.

నిప్పులు చెరుగుతూ అంది "వాడికి బుద్ధి లేకపోతే నీకేమైంది? బంగారంలాంటి నా మనవరాలిని, ఆ నల్లకాకికి ఇవ్వాలా? వాడు అడిగాడే అనుకో... నీకన్నా మంచీ, చెడూ తెలియక్కర్లా. ఇంతకాలం మా వాడికి కావాల్సిన వాళ్ళు అని, స్నేహంగా ఉంటే, నా ఇంటి మహాలక్ష్మినే అడుగుతావా? పోనీ మీ పెద్దాడికి అడిగావంటే కొంచెం ఆలోచించేదాన్ని. వాడు, వాడి రూపం పక్కకి పెట్టు, చదువు పూర్తి చేయకుండా పెళ్లి చేసుకుని ఏం చేస్తాట్ట?"

చాముండేశ్వరి కి అవమానంతో దుఃఖం వచ్చింది. రెండు చేతులూ మొహానికి అడ్డం పెట్టుకుని భోరుమంది.

వర్ధని పరుగున వచ్చింది. చాముండేశ్వరి భుజం మీద చేయేసి అత్తగారి వైపు కోపంగా చూస్తూ అంది. "అడిగినంత మాత్రాన మనం ఇచ్చేస్తున్నామా? ఆవిడ ఎత్తుకుపోతున్నారా? ఎంటత్తయ్యా? శుక్రవారం పూట నట్టింట్లోకి వచ్చిన ముత్తైదువను ఏడిపిస్తారా? చాల్లెండి. మీరు లోపలికి వెళ్ళండి. అయినా ఇలాంటి విషయాలు ఆడవాళ్ళు మాట్లాడుకునేవా? మగాళ్ళు ఉన్నారుగా వాళ్ళు నిర్ణయిస్తారు." అంటూ అత్తగారిని మందలించి, చాముండేశ్వరిని ఓదారుస్తూ "ఊరుకోండి వదినగారూ? పెళ్ళిళ్ళు స్వర్గంలో నిర్ణయింపబడేవి. మీరూ, నేనూ నిర్ణయించేవి కాదు.

ఊరుకోండి. ఏం జరుగుతుందో అది జరుగుతుంది. ఉండండి మంచి నీళ్ళు ఇస్తాను" అంటూ వంట గదివైపు వెళ్తున్న వర్ధనిని ఆపుతూ గాద్గదికంగా అంది చాముండేశ్వరి.

"నేనూ అదే అనుకున్నాను. కానీ, ప్రయత్నలోపం ఉండ కూడదని మాత్రమే ఇప్పుడు వచ్చాను. నన్ను మన్నించండి. పెద్దావిడకి కోపం రావడంలో అసహజం ఏమి లేదు." అని వర్దనిని వదిలి నాంచారమ్మ దగ్గరగా వెళ్లి, ఒంగి ఆవిడ పాదాలకు నమస్కరిస్తూ "క్షమించండి పిన్నిగారూ!" అని, గిర్రున వెనక్కి తిరిగి వర్ధని పిలుస్తున్నా వినకుండా వేగంగా వెళ్ళిపోయింది.

ఆవిడ వెళ్తున్న వైపు నిర్విణ్నురాలై చూస్తూ ఆవిడ కనుమరుగు అవగానే అత్తగారివైపు తిరిగి "ఏం పని చేసారత్తయ్యా? ఆయన్ని అడగాలని ఒకమాట చెప్పేస్తే పోయేది. తరవాత చూసుకునేవాళ్ళం కదా!" చిరాగ్గా లోపలికి వెళ్ళిపోయింది.

నాంచారమ్మ మాత్రం చిందులు తొక్కుతూనే ఉంది. సరిగ్గా ఆ సమయంలో "బామ్మగారూ! బామ్మగారూ!" అంటూ హడావుడిగా వచ్చాడు మోహన్.

అతన్ని చూడగానే అగ్గి మీద గుగ్గిలం అయింది ఆవిడ. "అరేయ్ ఆగరా. అడుగు ముందుకేసావంటే కాళ్ళు విరగ్గోడతా. నల్ల వెధవా. ఆరోజు ఏదో సాయం చేసావని, ఇంటికి రానిచ్చి, కాఫీలు, పలహారాలు పెట్టి ఆదరిస్తే, నా మనవరాలి మీద కన్నేస్తావా? నీ మొహానికి అది కావాలా? చంపేస్తాను"...

వర్ధని వారిస్తున్నా వినకుండా మోహన్ మీదకు వెళ్ళింది నాంచారమ్మ.

మోహన్ దిగ్భ్రాంతిగా చూస్తూ "ఏమైంది బామ్మగారూ నేనేం చేశాను" అన్నాడు.

"ఏం చేయడం ఏవిట్రా? నంగనాచిలా అడుగుతున్నావు. చదువులేదు, సంధ్య లేదు, రూపం లేదు, గుణం లేదు, నువ్వు నా మనవరాలిని ప్రేమిస్తావా? అది ఒప్పుకోకపోతే చస్తానని మీ అమ్మని బెదిరించి మా ఇంటి మీదకు పంపిస్తావా? నిన్నసలు"...

వర్దని ఆడపులిలా గర్జిస్తున్న అత్తగారిని గట్టిగా పట్టుకుని ఆపుతూ మోహన్ తో అంది." నువ్వు బయటికి వెళ్ళవయ్యా."

"అదికాదండీ... నేను చెప్పేది వినండి..."

అతడి మాట పూర్తి కాకుండా "ఏంటిరా వినేది" అంటూ మళ్ళీ అతని వైపు దూకింది నాంచారమ్మ.

వర్ధని గట్టిగా అరిచింది " మోహన్ నువ్వు ముందు బయటకి వెళ్తావా? వెళ్ళవా?"

మోహన్ కి అర్ధం అయింది. ఆశలన్నీ దగ్దం అవుతుంటే, ఎగసి పడుతున్న దుఃఖంతో అన్నాడు "నేను అందంగా లేకపోవచ్చు. కానీ నా మనసు మీకు అర్ధం కాదు. మీ అమ్మాయి ఆ డాక్టర్ తో తిరుగుతోంది. వాడు అసలు మంచివాడు కాదు. నేను వాడి గురించి అన్ని విషయాలు తెలుసుకుని వచ్చాను. మీ అమ్మాయిని తీసుకుని రైల్వే ప్లాట్ ఫారం మీద

కూర్చున్నాడు. వాడింటికి తీసుకెళ్తున్నాడు. ఆ తరవాత మీ ఇష్టం...మీ పరువు రోడ్డేక్కుతోంది అని చెప్పడానికి వచ్చాను.” వెక్కిళ్ళు పెడుతూ పరిగెత్తాడు.

అత్తా కోడళ్ళు ఇద్దరూ నిశ్చేష్టులై నిలబడి పోయారు.

మోహన్ స్వరం గాలిలో ప్రతిధ్వనిస్తోంది.

పవిత్ర డాక్టర్ తో తిరుగుతోందా? ఎక్కడ తిరుగుతోంది? ఇంత చిన్న ఊళ్ళో ఈ ఇంటికి సంబంధించిన ప్రతివారిని ప్రతివారు గుర్తుపట్టే ఊళ్లు ఎప్పటి నుంచి తిరుగుతోంది? ఎవరికీ తెలియకుండా ఎక్కడ కలుసుకుంటున్నారు? మోహన్ అక్కసుతో చెప్తున్నాడా? నిజమే చెప్తున్నాడా? ఆ డాక్టర్ కులమేంటి? గోత్రం ఏంటి? అసలు వాళ్ళిద్దరికీ ఎలా స్నేహం కుదిరింది?

నాంచారమ్మ తల పట్టుకుని కింద కూలబడింది.

వర్ధని షాక్ నుంచి తేరుకోనిదానిలా శిలలా నిలబడిపోయింది.

అప్పుడే మాధవ ఇంట్లోకి అడుగుపెట్టాడు.

భార్యా, తల్లి, శోకదేవతల్లా కూర్చోడం చూసి, నొసలు చిట్లిస్తూ అడిగాడు “ఏం జరిగింది?”

వర్ధని మాట్లాడలేదు. తలవంచుకుని నిలబడింది. ఈ విషయం ఈయనకి తెలిస్తే ఇంకేమన్నా ఉందా? పవిత్రనైనా చంపుతాడు, ఆ డాక్టర్ ని అయినా చంపుతాడు. ఎలా భగవంతుడా ఈ గండం దాటేదేలా తండ్రీ? మనసులోనే దేవుణ్ణి స్మరిస్తూ మౌనంగా ఉండిపోయింది.

“ఏమైంది అంటే ఇద్దరూ మాట్లాడరేం” చిరాగ్గా అడిగాడు మాడవ.

“ఏం చెప్పమంటావురా? మన పరువు గంగపాలు అవుతోంది... మన కుటుంబం రోడ్డున పడుతోంది. ఇంతకాలం కాపాడుకుంటూ వస్తున్న ప్రతిష్ట మంటగలిసి పోతోంది... నాయనో... ఈ పరిస్థితి మాకెందుకు వచ్చింది నాయనా?”–

“అబ్బబ్బ ఆపమ్మా! అసలేం జరిగిందో చెప్పకుండా ఈ శోకాలేంటి? నువ్వన్నా చెప్పచ్చుగా బెల్లం కొట్టిన రాయిలా నిలబడకపోతే “ భార్య వైపు చూసి కయ్యిమన్నాడు.

“అదేం చెబుతుందిరా? దాని నోట మాట రాడం లేదు ఈ వార్త విన్న దగ్గర నుంచి. పాపం ఎన్ని ఆశలు పెట్టుకుంది కూతురు మీద! అది ఇలా చేస్తుందని కల్లో కూడా అనుకోలేదు.” ముక్కు చీదుతూ అంది.

“అబ్బా విషయం చెప్తారా ఈ కుర్చీ విసిరేయనా? “ ఆవేశంగా కుర్చీ ఎత్తాడు మాధవ.

“ఆగరా ఆగు. నీ కూతురు ఆ డాక్టర్ తో తిరుగుతోందిట. “

“ఏ డాక్టర్?”

“అదేరా నా నడుం విరిగినప్పుడు వచ్చి వైద్యం చేశాడే అతనే.”

“ఆపు” గొంతు చించుకుని అరిచాడు.

“ఏవండీ? ఆవేశ పడకండి” అతనలా వీరంగం చేస్తుంటే కంగారుగా అంది వర్దని.

“ఎవరు చెప్పారు? ఎవరు చెప్పారు ఈ విషయం” మళ్ళీ అరిచాడు.

“ఇంకెవరు? వాడే. ఆ మోహన్ గాడు. వాడు మన పవిత్రని ప్రేమించాట్ట... దాన్నిచ్చి పెళ్లి చేయకపోతే చస్తానని తల్లిని బెదిరించాడుట. ఆవిడ గంపెడు ఆశతో వచ్చి అడిగింది. ముక్క చివాట్లు పెట్టి పంపించాను. వెనకాలే ఈ వెధవ వచ్చాడు. వాడి మెడ పట్టుకుని నెట్టబోతుంటే ఈ విషయం చెప్పాడు. వాడు అక్కసు కొద్దీ చెప్పాడో, నిజమో! ఎలా తెలుస్తుంది?” చెప్పడం ఆపింది నాంచారమ్మ.

మాధవ విసురుగా పెరట్లోకి వెళ్లి గాండ్రించినట్టు పిలిచాడు.”అరేయ్ మోహన్!”

డాబా మీద పిట్టగోడ కింద మోకాళ్ళ మీద తల పెట్టుకుని వెక్కి, వెక్కి ఏడుస్తున్న మోహన్ ఒక్కసారిగా అదిరిపడ్డాడు. గబుక్కున లేచి పిట్టగోడ మీద నుంచి తొంగి చూసాడు. పెద్ద పులిలా నిలబడి ఉన్నాడు మాధవ. మోహన్ కనిపించగానే “రా, రా కిందికి రా... వెంటనే రా...” అరిచాడు.

మోహన్ గజగజ వణికాడు. ఆ అరుపులకి అప్పటికే మేడ మీదకి చేరుకున్న చాముండేశ్వరి “ఏమైందిరా?” అని అడిగింది.

“తెలియదమ్మా. ఆయన అరుస్తున్నారు” అన్నాడు.

ఆవిడ తనలో కలుగుతున్న భావోద్వేగం అణచుకుంటూ “వెళ్ళు, వెళ్లి మాట్లాడు. మహా అంటే తిడతారు. నిన్నేం కొట్టరు కదా! వెళ్ళు నాన్నా... ప్రేమించినవాడికి ముందు ఉండాల్సింది ధైర్యం. నువ్వు దొంగతనం చేయలేదు, హత్య చేయలేదు. ప్రేమించావు అంతేగా వెళ్ళు. వెళ్లి చెప్పు.” కొడుకు భుజం తడుతూ ప్రోత్సహిస్తూ అంది.

“వెళ్ళనా?” బెదురుతూనే అడిగాడు.

“వెళ్ళు.వెళ్ళకపోతే ఇంకా పెద్ద రభస అవుతుంది. వెళ్ళు” అంది.

మోహన్ తడబడే అడుగులతో, అదిరే గుండెలు చిక్కబట్టుకుని మెట్లు దిగి కిందకి వెళ్ళాడు. ఆవిడ అక్కడే రెండు చేతులూ గాలిలో జోడించి దైవమా నా కొడుకుని నాకు దక్కించు అని ప్రార్ధించింది.

అప్పటికే మాధవ ఇంటి గుమ్మంలో అడుగుపెట్టిన మోహన్ ని ఉగ్రరూపంతో అడుగుతున్నాడు మాధవ.

“నువ్వు వీళ్ళతో చెప్పింది నిజమేనా?”

మోహన్ మాట్లాడలేదు. ఏడుపు వస్తోంది. తల వంచుకుని నిలబడ్డాడు.

“చెప్పరా... నిజమేనా? “

మోహన తల ఊపాడు.

“నువ్వు చూసావా”

అవును అన్నట్టు తలాడించాడు.

"నిజం కాకపోతే నిన్ను బతకనివ్వను జాగ్రత్త. " తర్జనితో బెదిరించి, పెద్ద, పెద్ద అడుగులేసుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు.

అపుడే పార్ధసారధి కారు వాళ్ళ గేటులో ఆగింది. మాధవ సింహంలా వెళ్ళడం, వెనకాల తన కొడుకు తప్పు చేసినవాడిలా కళ్ళల్లో నీళ్ళతో నిలబడి ఉండడం చూసిన ఆయనకి ఏం జరిగిందో అర్థం కాలేదు. నిజానికి ఆయనకీ మోహన్ పవిత్రని ప్రేమించిన విషయం కానీ, ఆమెని పెళ్లి చేసుకోకుంటే చచ్చిపోతానని చెప్పడం కానీ చాముండేశ్వరి భర్తకి చెప్పలేదు. ఇప్పుడు చెప్పాల్సిన సమయం ఆసన్నం అవడంతో ఆవిడ కూడా మెట్లు దిగుతూ తూలిపడబోయి నిలదొక్కుకుంది. పార్ధ సారధి లోపలికి వచ్చి, బయట ఏం జరుగుతోంది? మాధవ ఎందుకంత కోపంగా ఉన్నాడు? మనవాడు తప్పు చేసినట్టు ఎందుకు నిలబడ్డాడు?" అని ప్రశ్నించాడు.

అడుగులో అడుగు వేసుకుంటూ మోహన్ లోపలికి వచ్చాడు.

ఆయన ఆవిడ నుంచి చూపులు మరల్చి కొడుకు వైపు తిప్పి "ఏం జరిగిందిరా?" అన్నాడు.

మోహన్ తల్లివైపు చూసాడు.

ఆవిడ నచ్చచెబుతున్నట్టు గా మెల్లగా అంది "చెప్తాను. ముందు మీరు మంచినీళ్ళు తాగి విశ్రాంతి తీసుకోండి."

"ముందు నాకు చెప్పు " హుంకరించాడు.

ఆవిడ గొంతు తడారిపోయింది. అక్షరాలు వెతుక్కుంటూ జరిగింది అంతా చెప్పింది. "ఏదో చిన్నపిల్లాడు ఆశ పడ్డాడు. వాళ్ళు కాదన్నారు అయిపోయింది. మీరు శాంతించండి" అంది.

ఆయన ఆవిడకి సమాధానం చెప్పకుండా, మోహన్ దగ్గరగా నడిచి అతని మొహంలోకి తీక్షణంగా చూసాడు. మోహన్ భయంగా చూసాడు. చూస్తూ ఉండగానే ఆయన చేయి గాలిలోకి లేచి బలంగా అతని రెండు చెంపలని తాకింది.. మోహన్ ఆయన విసురుకి వెళ్లి సోఫా మీద పడ్డాడు. చాముండేశ్వరి ఆర్తనాదం చేసింది.

"దరిద్రపు వెధవా! నీ మొహానికి ప్రేమ ఒకటా… పైగా ఆ పిల్లనా? నా పరువు తీసావు కదరా… మా స్నేహం ఇంతటితో సమాప్తం అయింది. ఛీ నీలాంటి కొడుకుని కన్నందుకు అసలు నిన్ను అనాలి…" చాముండేశ్వరి వైపు తిరిగి మండిపడ్డాడు.

"అదికాదండీ" ఆవిడ మాట పూర్తి కాకుండానే గట్టిగా అరిచాడు. "వీడు నా కంటికి కనిపించద్దు . తక్షణం ఇంట్లోంచి వెళ్లిపోవాలి."

చాముండేశ్వరి బావురుమంది. "అయ్యో అదేంటండి. వాడు చేసిన చిన్న తప్పుకి ఇంత శిక్షా? ఎందుకండీ వాడిని అలా బాధ పెడతారు నల్లగా పుట్టడం వాడి తప్పా? "

“అదంతా నాకు అనవసరం. వాడు ఈ ఇంట్లోంచి వెంటనే వెళ్ళకపోతే నేను వెళ్ళిపోతాను. సరిగ్గా గంట టైం ఇస్తున్నాను. అన్నీ సర్దుకుని వెళ్లిపోవాలి. నీ దగ్గర ఎంత డబ్బు ఉంటే అంతా ఇచ్చేయ్ వాడికి. ఎక్కడికైనా వెళ్ళమను ... ఎలాగైనా బతకమను. అంతే” ఆయన మాట చండశాసనం.

శాసనం చేసి లోపలికి వెళ్ళిపోయాడు. ఆయన తిరిగి అక్కడికి వచ్చేలోగా మోహన్ వెళ్లిపోవాలి అదే ఆయన శాసనం.

చాముండేశ్వరి కుప్పకూలిపోయింది. మోహన్ గట్టిగా అరిచాడు “అమ్మా”.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS